ఆమె వంటింట్లో గెంతులేస్తోంది. వామనమూర్తీ, నేనూ ఏమయ్యిందంటూ అడిగేసరికి ఆమె భయం భయంగా డైనింగు టేబుల్ కిందున్న ఎలుక కన్నంవైపు చూపిస్తూ "దె.దె.దెయ్యం. పి.. పిల్లదెయ్యం" అంటూ బెదురు బెదురుగా ఆ కన్నంవైపు చూస్తోంది.

నేనూ వామనమూర్తీ ఆ కన్నంలోకి చూశాం. నేనైతే అందులో ఉన్న అకారం ఇకిలించినట్లుగా ఉండటం చూసి ఉలిక్కిపడ్డాను.

వామనమూర్తి మాత్రం ఎగిరిగంతేశాడు.

"దొరికాయి. దొరికాయి నా పళ్ళు దొరికాయి." అంటూ ఆ కన్నంలో చెయ్యిపెట్టబోతే అతని చెయ్యిదూరలేదు.

రెండు మూడుసార్లు ప్రయత్నించి, 'లక్ష్మీ, నువ్వు ప్రయత్నంచెయ్యి. అందులో ఉన్నది పిల్లదెయ్యంకాదూ పాడు కాదు. నా పళ్ళు" అంటూ భార్యను బ్రతిమిలాడాడు.

"ఛీఛీ ఆ పళ్ళను నేను ముట్టుకోనుబాబూ అయినా మీ చెయ్యిదూరనపుడు నా చెయ్యి మాత్రం ఎలా దూరుతుంది?" అంటూ మూతిమూడువంకర్లు తిప్పింది.

నాకో ఆలోచన వచ్చింది.

"ఏవండోయ్ మీ నానిగాణ్ణి పిలవండి వాడి చెయ్యి సన్నంగా ఉంటుంది కదా, ఈజీగా తీసెయ్యొచ్చు" అంటూ ఓ సలహా ఇచ్చేశాను.

వెంటనే వాళ్ళబ్బాయిని పిలిచి ఆ పళ్లను తియ్య మన్నాడు. నానిగాడు ఇకిలించుకుంటూ ఆ కన్నంలో చెయ్యిపెట్టి పళ్ళను చేత్తో పట్టుకుని "ఆడుకుంటా" అంటూ ఒక్క ఉరుకులో బయటకు పరిగెత్తాడు.

వాడి వెనకాలే నేనూ, వామనమూర్తీ పరిగెత్తాం.

వరండాలో రెడీగా కూర్చున్న మా కుక్క నాని చేతిలో ఉన్న పళ్ళసెట్టు ఊడలాక్కుని నోటి మధ్య కరుచుకుని ఎదురింటివాళ్ళ బాతురూంవైపు పరిగెత్తింది.

ఓ పక్కనానిగాడి ఏడుపూ, మరోపక్క కుక్కను వెంటాడుతూ వామనమూర్తీ పట్టు వదలని విక్ర మార్కుడిలా ఎదురింటివాళ్ళ బాత్‌రూంలోకి అడుగుపెట్టాడు.

అంతే!

'చెళ్ళు'మన్న శబ్దం -

కొద్ది క్షణాల్లో బయటకి వచ్చిన వామనమూర్తి చెంప సబ్బునురగతో నిండిపోయి వుంది.

విషయం అర్థమయిన నేను పరిగెత్తుకెళ్ళి వామన మూర్తిని లాక్కొచ్చేశాను.

ఐదు నిమిషాల తరువాత ఎదురింటాయన పేపరు చుట్టిపట్టుకొచ్చిన పళ్ళసెట్టును వామనమూర్తి చేతిలో పెట్టాడు.

"బోసిబాబూ ఏమీ అనుకోవద్దు. స్నానం చేసే టైములో మీరు బాత్‌రూంలోకి వెళ్ళేసరికి ఏంచెయ్యాలో తెలీక మిమ్మల్ని చెయ్యిచేసుకుంది. ఇప్పటికైనా ఇవి ఎవరికీ దొరక్కుండా దాచుకోండి వస్తా"

అంటూ వెళ్ళిపోతోన్న ఎదురింటాయన్ని చూస్తూ నోటిమాటరాక వామనమూర్తి కొయ్యబారిపోతే - అతన్ని లాక్కుంటూ అతని భార్య లోపలికి తీసుకెళ్ళిపోయింది. ★

కూసుపూడి లక్ష్మణరావు
C/O సంస్కార్ చె?? నిలయం
వర్ని, నిజామాబాద్ జిల్లా.

కథ

# ఎవరీ మామ?!




"మీ ఇంటికెవరో చుట్టాలు వస్తున్నారు."

"మా ఇంటికా? కాదు... కాదు మీ ఇంటికే. చూద్దాం..."

రిక్షా, సత్యమూర్తి ఇంటిముందు ఆగింది.

రిక్షా దిగిన పెద్ద మనిషి తెల్లషర్టు, తెల్ల దోవతి కట్టుకున్నాడు. భుజాన లాల్చీవేసుకున్నాడు. హుందాగా నడుచుకుంటూ సత్యమూర్తి దగ్గరకు వచ్చి...

"సత్యమూర్తి ఎవరండీ?" అడిగాడు.

"నేనే...ఏంటి? ఏం కావాలీ?"

"మావాడు హరి మీ ఇంట్లోనే కదా అద్దెకున్నాడు..."

"అవును అవును.."

"నేను అతని తండ్రిని.. బాబూ"

"వాళ్ళు ఇప్పుడే సినిమాకి వెళ్ళారు."

"మా వాడికి సినిమా పిచ్చి ఎక్కువ...నేను ఈరోజు వస్తున్నానని ఉత్తరం కూడా రాశాను. అయినా వాళ్ళు సినిమా కెళ్ళారంటే బాధగా ఉంది! కనీసం నా కోడలు కన్నా బుద్దుండాలిగా.. సరే. నా దగ్గర తాళం చెవి ఉంది! అంటూ... తాళం తీసి" లోపలికెళ్ళి ముఖం కడుక్కొని. భోంచేశాడు. కాస్సేపటికి బ్యాగ్‌తో సహా బయటకొచ్చి యధా విధిగా తాళంవేసి సత్యమూర్తి దగ్గరకు వెళ్ళాడు...

"సత్యమూర్తిగారూ! నేనో ఒక ముఖ్యమైన పని విషయమై బోధన్ వెళ్తున్నా మళ్ళీ వస్తానో, రానో, మావాడితో చెప్పండి"

అని పది రూపాయల నోటొకటి జేబు నుండి తీసి "నా మనువడికివ్వండి" అని చెప్తూ రిక్షా ఎక్కి బయలు దేరాడు.

రెండు గంటల తర్వాత హరీ. అతని భార్యా రిక్షా దిగారు.

చుట్టు ప్రక్కల పిల్లలంతా వాళ్ళిద్దరి చుట్టూచేరి 'ఆంటీ!... రాహుల్ తాతగారు మీకోసం వచ్చి వెళ్ళారు" చెప్పారు. ఎవరబ్బా అన్నట్టూ... భార్యా భర్తలిద్దరూ ఒకరిమొఖం ఒకరు చూసుకొన్నారు... వచ్చిన పెద్ద మనిషి మీ మామనా, లేక మా మామనా అనీ...

తలుపులు తీసి చూస్తే సామానంతా చిందర వందరగా పడుంది. పెట్టెలో దాచిన రెండు తులాల బంగారం, రెండువేల రూపాయలు లేవు..

అంటే, ఆ పెద్ద మనిషి దొంగన్న మాట!

హరి భార్య నెత్తీ, నోరూ బాదుకుంది! చుట్టు ప్రక్కల వాళ్ళందరూ గుమిగూడారు.

అందరూ చూస్తూండగానే ఆ పెద్ద మనిషి విలువైన వస్తువులన్నీ దోచుకొని వెళ్ళిపోయాడు!

-నానక్‌సింగ్,
ఇ.నెం.9-4-6?
బురుజ్‌గల్లీ,
నిజామాబాద్.